

# ఖాళీ

కె.ఎన్. మల్లీశ్వరి

అనేక పరాజయాలు...
అనేకానేక ఖాళీల అనంతరం...

*

నిశినంతా గుండెల్లోకి వంపుకున్నంత బరువు. బరువులోంచి మెల్లగా కదుల్తోంది ఏదో... బిగుసుకు పోతున్న ఒళ్లు... ఒళ్లంతా చెమట్లు. మృదంగం ఆరో హణా స్థితికి చేరుకుంటోంది. ధడ్... ధడ్... ధడ్... లే... లే... పారిపో... పరిగెత్తూ... ఎక్కడికీ?... ఎక్కడికీ?... ప్రతి గడీ ఖాళీ అయిపోతుంటే...

ఎవరు చెక్ చెపుతున్నారు? ఎవత్తది? ఆ ఇంద్ర జాలపు పెట్టెలో నిలబడింది? రంగుల్లో ముంచితీసిన ఆకారం. వచ్చింది రానట్లుగా తెలుగుకాని తెలుగు. రానివి వచ్చినట్లుగా నవ్వులు కాని నవ్వులు రువ్వు తున్నది ఎవరు?

ఎంత బావుంది? లేతగా పాలుగారుతున్న మొక్క జొన్నకంకిలా... కడుపు మండటం లేదు కానీ మొగలి ముళ్లలా చర్మంపై నూగు ఇలా లేస్తోందేంటి?

మెల్లగా పాకుతూ వచ్చిందేదో గుండెల్లో ఉండ చుట్టుకుంటోంది. నిన్నటివరకూ నేనే కదా!

నేనే కదా బుల్లి తెర ప్రపంచాన్నేలింది.

నేనే కదా సర్వసుఖ భ్రమల మత్తులో తేలియా డింది.

మరిపుడు నేనేమో వడిలిపోయిన శంపాలతలా...

అదెవత్తో తటిల్లతలా...

నేనేమౌతున్నాను?

నన్నేం చేస్తున్నారు?

"ఊ... ఇక చాలా కష్టం... బుగ్గలు జారిపో యాయి... హిహ్హిహ్హిహి... అవి కూడానా? తెలిస్తేగాని ప్రోగ్రాం సంగతి చెప్పలేను," సజెస్టివ్‌గా చూసిన చూపు.

ఎవరన్నారు చూపుకి ఆకారం లేదని? దాని వెన కున్న ప్రపంచ వ్యూహమంతా ఇనుప పిడికిలితో నా గుండెలపై గుద్దుతుంటే...

ఆ కీటకానికి ఒకటే చెప్పాలనిపించింది.

'రేయ్... పురుగా... ముప్ఫయ్యారు, ఇరవై నాలుగు, ముప్ఫయ్యారు కొలతల్ని తప్ప ఏనాడైనా హృదయాన్ని కావలించుకొన్నావా? ఆ శక్తి ఉంటే కదా ఆ ఉన్నతత్త్వం ఏంటో తెలియడానికి,' అని.

ఒహటే ఆశ్చర్యం ఇట్లా అనాలనుకొంది నేనేనా? అన్నానా? లేదుగా... ఇంకా ఆశే... నా ఈ వస్తువుని ఇంకా ఇంకా తోమీ, రుద్దీ, పూసీ, మసిపూసి మారేడు కాయ చేసైనా అవకాశాలు పొందాలి. లేకపోత నే వెనుక బడిపోనూ... నేనొక్కదాన్నే. అమ్మో... ఒక్కదాన్నే. భయం వెన్నుని ఆప్యాయంగా నిమురుతోంది.

నా గుండెకేమయింది, చళ్లున చరిచినట్లు ఎగి రెగిరి గొంతు కడ్డం పడుతోంది. కాసేపయినా ఎక్కడా కూర్చోనివ్వని, నిల్చోనివ్వని గుబులు, భయం, ఆందోళన.

వడివడిగా సాగిపోవాలి. నాలోకి నేను ప్రహేళి కలా చిక్కులుబడిపోవాలి. వెనక నుంచెవరో తరుము తున్నారు. ముందు నుంచెవరో మీది మీది కొస్తున్నారు. పక్కల నుంచెవరో నొక్కేస్తున్నారు, నలిపేస్తున్నారు.

'పబ్లిక్ ప్రాపర్టీ'... ఈ నడిచే వినోదం జనాల్లో కొచ్చి నిలబడితే చాలు... రండి... ముట్టుకోండి... ఆల సించిన ఆశాభంగం... మీరు విహారాలకి వెళ్లినపుడు

నచ్చిన వస్తువుల్నో, కట్టడాల్నో నిమిరీ, పామీ, గిల్లీ, రక్కీ పరమానందాన్ని పొందరూ... పరమానందమానంద మాయనే... ఆనందమాయనే... ఆనంద్ మాయ మయ్యేనే...

ఆనంద్... నవ్వు రాజిల్లెడు మోమువాడు కదా! చటుక్కున ఇక్కడ మాయమయి ఎక్కడ ఏ పొదల మాటున ఏ ప్రేయసిపై ప్రణయ గీతాలల్లుతున్నాడో. A man born with lust for love. అతని దాహాన్ని తీర్చ డానికి అనేక హృదయాలు కావాలి.

ఒకప్పుడు కళ్లతో ఒంటికి మత్తు అత్తరు పూసే వాడు. కథల్లో కవితల్లో నన్ను నిలబెట్టి పట్టాభిషేకం చేసేవాడు. నా వెతుకులాటకి అతని సాహచర్యమే సంపూర్ణత్వాన్నిస్తుందనుకున్నాను. కానీ ఏం జరిగింది? నన్ను 'నిలువుదోపిడి' చేసేశాక తనకున్న ఒక్కో పొరనూ వలుచుకొంటూ నా హృదయంలోని హిమాలయాన్ని ఆనవాలు లేకుండా కరిగించి వేశాడు. కరిగి కరిగి ప్రవహిస్తూ దారి మళ్లాడు.

అబ్బా! గుండె ఇంత భారమయిందే! ఇన్ని మత్తు మందులూ నాకేమీ సాయం చెయ్యడం లేదే! అమ్మా! అమ్మా! పసిపిల్లలా ఒళ్లెరక్కుండా నిద్రపోవాలని వుందే!... లాలించవూ.

అమ్మా! కోడిపిల్లలా నీరెక్కల్లో ఒదిగొదిగి ఈ శరీరాన్ని దాచేసుకోవాలని ఉందమ్మా. ఈ ప్రపంచంతో పోరాడి అలిసి వెనుదిరిగితే కన్పించే శూన్యాన్ని తట్టు కోడానికి ఓ వెచ్చనైన గర్భం నాకోసం ఎదురుచూస్తుం దని ఆశపడ్డాను. కానీ... కానీ... యూ టూ అమ్మా!!!...

నా నుంచి నేను శకలాలుగా విడిపోతున్నప్పుడు బిడ్డ సంచీలో పొదువుకోవాల్సిన నువ్వే నన్ను డబ్బు సంచీలా చూశావు. ఇంకేం జరగాలి?... కారల్ మార్క్స్ గెలిచాడు. శతాబ్దాలుగా ఆ సత్యమే గెలుస్తోంది. అందుకే నాకు నువ్వొద్దమ్మా... అమ్మతనం కావాలి. అవధులు లేని ప్రేమ కావాలి.

ఈ మగత జిగటలా చుట్టుకుంటోంది. నిలవదు, వదలదు. ఆకాశంలో విమానాలు మంటలతో ఫెటి ల్లున పేలిపోతున్నాయి. లోయలోకి జారిపోతున్నా. పట్టుకోండి... కిందికి చూస్తుంటే భయం. లోయ అడుగున నిటారుగా పొడుచుకు వచ్చిన భయంకర జ్ఞాపకాల ఆనవాళ్లు. మళ్లీ మళ్లీ వాటిమీదే ఎన్నిసార్లు పడను?

ఎవరెవరో తోకలూపుకొంటూ పరాక్రమిస్తున్నారు. తమ వెట్‌డ్రీమ్స్‌లోకి నన్ను బలవంతంగా లాగు తున్నారు...

వదలండిరా...

ప త న మ వు తు న్నా...

చిన్నపిల్లలకిలా శరీరం ఎక్కడో స్వాధీనం తప్పింది.

పక్క తడిచింది.

*

ఆటోనా? కారా?

వందా? రెండొందలా?

హాండ్‌బాగేమో తేలిగ్గా ఉంది. ఆశేమో బరువుగా ఉంది. అయినా మోస్ట్ బ్యూటి ఫుల్ అండ్ టాలెంటెడ్ తెలుగు టి.వి. యాంకర్‌నైన నేను ఆటోలో వెళ్లడమా?

పద... తియ్ కారు... పోయించు పెట్రోల్... సంపాయించు డబ్బు... కొట్టెయ్ ప్రోగ్రాం... పట్టెయ్ ఎవడివో కాళ్లు... కాళ్లు... కాళ్లు పట్టుకొని, బతిమలాడి దండాలు పెడితే వస్తుందా ఛాన్స్... ఇంత సులువుగా ధర్మం నాలుగు కాళ్లా నడుస్తుందా ఈ మాయా ప్రపంచంలో...

ఇదొక రోగ ప్రపంచం... ఏం చెపుతారో ఇక్కడ. డాక్టర్ సి. శ్యామ్‌ప్రసాద్, సైకాలజిస్ట్.

బోర్డ్ తాలూకు గదిని చేరుకొనేలోపు అడుగడు గునా అడ్డు పడుతున్నాయి పాడునోళ్లు... ఎక్కడ చూసినా ఇవే... ఇదుగో ఇక్కడో మగనోరు... నన్ను చూడగానే తెరుచుకొంది.... నా శరీరంపై స్రవిస్తోంది... మొహం నుంచి ఎన్ని గుప్పెళ్ల అసహ్యాన్ని వెదజల్లను ఆ నోరు మూతబడటానికి? వీడు డాక్టర్ పావ్‌లావ్‌గారి కుక్కకన్నా హీనం. గంట కొట్టకుండానే చొంగ కారు స్తాడు.

పద... పెనం మీంచి పొయ్యిలోకి దూకడానికి... త్వరగా పద... కానీ... హబ్బ! ఈ డాక్టర్‌ని చూడగానే ఎంత హాయిగా ఉంది! చల్లగా నవ్వుతున్నాడు... ఆత్మీ యంగా పలకరిస్తున్నాడు. సరే... సరే... ఇన్ని సుగుణా లతో ఉన్నాడు కదా!... కౌన్సెలింగ్ ఫీ... ఇవ్వనంటే... అప్పుడు... అపుడు మొహం ఎలా మారిపోతుంది? ఇతను తగిలించుకొన్న ముసుగుని లాగి లాగి చూస్తే...

"మీ పేరు చెప్పండి?..."

తెలీదా? ఇతనికి తెలీదా?... తెలిసేనా?... టి.వి. చూడడా?...

మంచిదే... మంచిదే...

"రాధిక..." చెప్పాను. ఎందుకొచ్చిందీ చెప్పాను.

"ఇంకా చెప్పండి..."

"చెప్పానుగా!..." రాత్రి గురించి చెప్పానుగా!... పగటి గురించీ చెప్పానుగా. భయం, గుబులు నిలవ నివ్వడం లేదని చెప్పానుగా!...

"ఆ విషయం వదిలెయ్యండి... మీ గురించి చెప్పండి. చిన్నప్పటి విశేషాలు, మీ లైఫ్ స్టైల్, అన్నీ దాచుకోకుండా చెప్పండి."

తవ్వితవ్వి అలిసిపోయాను. మళ్లీనా?...

డాక్టర్ చూస్తున్నాడు. నా అంతరాంతరాళాల్లోకి చొచ్చుకుపోతున్నాడు. నాకోసమేగా. నాకు సాయం చెయ్యడానికేగా. తోవ ఇస్తా.

*

మిలమిల్లాడే తారకలు... చల్లనిగాలి... అందరం డాబా మీదికి చేరి వెన్నెల జున్నుని నంజుకొంటూ ఆటల విందు చేసుకొన్న రోజులు. గుంపులోని ఆనందం ఎంత గొప్పగా ఉండేది!

వసంతం వస్తే చాలు ప్రతి ఉదయం మామిడి తోటలో దొంగ కోయిలలమయ్యే వాళ్లం. మామీద పంతంతో కూసికూసి రోషపడిన కోయిల చివరికి విరక్తి తో ఎగిరి వెళ్లాక విజేతల్లా చేతులు చరుచుకొనేవాళ్లం.

నడి గ్రీష్మపు మిట్టమధ్యాహ్నం ఈశాన్యం నుంచి హడావుడిగా కమ్ముకొచ్చిన నల్ల మబ్బులు ఇళ్ల మీదా, చెట్లమీదా, రోడ్లమీదా, మా హృదయాల్లోనూ మంచు పూల వానని కురిపించి పారిపోయేవి. కరిగేలోపు ఏరుకో వాలని ఎంత ఆరాటం!

హేమంతపు సాయంకాలాల్లో కట్టెలపొయ్యి మీద అమ్మ కాసే ఉలవచారు వాసన తగలగానే ఎక్క డెక్కడి వాళ్లమూ తోక తెగిన ఉల్కల్లా ఇంటి మీదికి రాలిపడేవాళ్లం. మొదటి గరిటె చారులో ఎంత కమ్మ దనం!

యవ్వనారంభం కలలమయం. చదువు, ఆట పాటలు, చిన్న కవితలు రాయడం, పెద్దపెద్ద పుస్తకాలు చదివేసి మేధావిలా కనపడే ప్రయత్నం. ఎన్నని? నా తోటి అమ్మాయికి వచ్చిన ప్రేమలేఖ నాలో కలిగించిన అసూయ ఈ అందమైన జ్ఞాపకాల చీరకి మేలియంచే కదా!

నా పద్దెనిమిదో ఏట హఠాత్తుగా రాత్రికి రాత్రే జీవన లక్ష్యాలు వేగంగా మారిపోయాయి. నటన పట్ల ఆసక్తితో ఓ పత్రికకి పంపిన ఫొటో ప్రచురింపబడింది. వారంరోజులు ఇంట్లో ఫోన్ విరామం లేకుండా మోగింది.

అంతా నా గొప్పతనమేననీ, నేను అత్యంత సౌందర్యరాశిననీ, నా నటన కోసం ప్రపంచం రెడ్ కార్పెట్ పరిచిందనీ ఎంత అమాయకంగా నమ్మాను!

స్త్రీ బయట అడుగుపెడితే చాలు లైంగిక సామర్థ్యాన్ని ప్రదర్శించడానికి ఉబలాట పడే వీరులున్న లోకంలో పత్రికకెక్కిన నన్ను వదుల్తారా! ఫోన్లలో మాట్లాడిన మగాళ్లంతా నన్ను నటశిఖరం మీద కూర్చో బెడతామన్నవాళ్లే.

ఇక తమ మధ్యతరగతి జీవితాలతో విసిగి పోయిన నా కుటుంబం పెనుమార్పు తేవాల్సిన బాధ్యతని 'అయిష్టాన్ని నటిస్తూ' నా మీద పెట్టింది.

ఎన్ని ఆశలు! ఎన్ని ప్రలోభాలు! ఎన్ని బరువులు! అన్నీ మోస్తూ ఈ మహానగరానికి వచ్చాను.

మనిషిలోంచి హృదయాన్ని ఊడబెరికి శరీరాన్ని వస్తువుగా మార్చే క్రీ(నీ)డలోకి వచ్చిపడ్డాను. దిగితేకానీ లోతు తెలియలేదు. తెలిశాక వెనక్కి రాలేని నిస్స హాయత.

నన్ను చూసి ఈ ప్రపంచానికెంత ఆందోళన! నాకు నలుగురు బాయ్‌ఫ్రెండ్స్ వుండటం చూసి ఎంత దుఃఖం! 'మన సంస్కృతి ఏంటి?', 'ప్రపంచంలో భారత స్త్రీకి వున్న విలువ ఏంటి?' లాంటి మాటలతో నన్ను అంచనా కట్టడం ఎవరి తరం?

అతి పెద్ద వేటగాడు విసిరిన భూగోళమంత వలలో నేనూ ఇరుక్కున్నాను. అందుకే నాకు డబ్బు కావాలి. నిజంగానే పద్దెనిమిదేళ్లకే నేను డబ్బు గురించి ఎక్కువగా ఆలోచించాల్సి వచ్చింది.

నిజమే... నాకు డబ్బు కావాలి.

బతకడానికి, ఆశల్ని బతికించుకోడానికి, జుట్టు కొసల్నుంచీ, కాలివేళ్ల వరకూ ఇంకో నేనుగా కనిపించ డానికి, నా ఆర్థిక పరిస్థితులను బట్టి మగాళ్లు నన్ను 'అవైలబుల్'గా భావించకుండా ఉండడానికి, యాడ్స్ లో సినిమాల్లో మేమెలా ఉండాలో మీరంతా పదేపదే ఇంజెక్ట్ చేస్తున్నట్లుగా మమ్మల్ని మేము మలుచుకో డానికి నాకు డబ్బు కావాలి.

చివరికి యాంకర్‌నయ్యా! ఎన్ని విలువల్ని ధ్వంసం చేస్తే ఈ మార్గం దొరికింది! విలువలు... ఏ విలువలు? మీరు చెప్పేవో, నేను నమ్మేవో కాదు. చిన్న తనం నుంచీ కుటుంబం, సమాజం నా చేత పాటింప జేసిన విలువలు... నిరంతరం రగిలే అసంతృప్తి లోంచి ఖాళీలు ఏర్పడసాగాయి.

పెళ్లితో పూరించే ప్రయత్నం చేశాను. అదో పీడకలగా ముగిసింది. నా భర్తకి డబ్బు కావాలి, పేరు ప్రతిష్ఠలు కావాలి... ఇవన్నీ నేను గడప దాటకుండా అతనికి అమర్చి పెట్టాలి. అతను పెట్టిన హింసను నా మనసు, శరీరం అనేక గుర్తులుగా మోశాక ఇక మోయ లేని స్థితిలో చట్టబద్ధంగా అతన్నుంచి విడిపోయాను.

తర్వాత్తర్వాత నీటిబుడగల్లాంటి ప్రేమలు చాలా పలకరించాయి. ఏవీ నిలవలేదు. అట్లాంటి సంఘర్షణ లో నేనుండగా మా ఛానెల్లో అడుగుపెట్టాడు ఆనంద్. అతను గొప్ప రచయిత, మేధావి, ప్రేమైక జీవి. అతన్ని చూసినా, మాట్లాడినా ఉద్వేగం. అతని సాన్నిహిత్యాన్ని మనశ్శరీరాలు గాఢంగా కోరుకొన్నాయి. అతనూ అంతే. తన అన్వేషణలో దొరికిన నిధినన్నాడు. మా ఇద్దరి మధ్యా అనుబంధం ఏర్పడింది.

మేవిద్దరం కలిసి జీవించసాగాం. అయితే 'సహ జీవనం' అతనికి ఒక 'విజిగీష.' నాకేమో ప్రేమ, అవ గాహనల కలబోత.

స్పర్థలు మొదలయ్యాయి.

నేను బిజీగా ఉండి అతను ఖాళీగా ఉన్న సమయాల్లో నాలుగు రోజులు వరుసగా అతనే వంట చేయాల్సి వచ్చేసరికి ఆ 'వాది'కి హఠాత్తుగా సమానత్వం గుర్తొచ్చేది.

సహజీవనం అంటే ఇలా అర్థమయిందా అతనికి!!

సహజీవనం గురించి చర్చించేటప్పుడు కలిసి ఉండటంలోని మాధుర్యాన్ని నేను ఆస్వాదిస్తే విడిపోవ డంలోని సులువు గురించి అతను మురిసిపోయేవాడు.

నాకర్థమయ్యేలోపే ఓరోజు నవ్వుతూ నా బుగ్గల్ని ముద్దాడి 'స్నేహంగా' నా నుండి విడిపోయాడు. అతనికి నా మీద ప్రేమ పోగానే నాకతని మీద ప్రేమ పోలేదు. పోగొట్టుకోడానికి అతన్ని ఎంత ద్వేషించాల్సి వస్తోంది.

కుటుంబం, స్నేహితులు, భర్త, ప్రేమికులు, సహచరుడు నా హృదయాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇపుడు యవ్వనం ఖాళీ చేస్తానని బెదిరిస్తోంది. నా యవ్వనం చుట్టూ నేను బలంగా నిర్మించుకొన్న హర్మ్యం కూలిపోతే నేనేం కావాలి? ఇంక నేను దేనికి పనికి వస్తాను?

జ్ఞాపకాల బరువు గుండెని అదిమేస్తుంటే కాళ్లలో వణుకు... కళ్లలో గిర్రున తిరుగుతున్న ప్రపంచం.

డాక్టర్... డాక్టర్ ఎవరిస్తారు సాంత్వన? పడిపో తున్నానా?

"సిస్టర్... సిస్టర్... రిలాక్సవ్వండి... రిలాక్స్..."

అవుతాను... అవ్వాలనే ఉంది. కానీ ఎలా?

"కంగారుపడకండి. చిన్న మానసిక రుగ్మత. ఎంప్టీనెస్ సిండ్రోమ్. కౌన్సెలింగ్ మొదలుపెడతాను... మళ్లీ ఎప్పటిలాగే..."

ఎంప్టీనెస్ సిండ్రోమ్!! ఊహూ...

ఎంప్టీనెస్ సిండ్రోమ్... ఈ 'గూడు ఖాళీ అయిన దుఃఖాన్ని' మోస్తూ ఎలా జీవితాన్ని సాగించడం?

*

స్టూడియో అంతా హడావుడి... ఎవరికివారే నేనంటూ లేకపోతే ఈ ప్రపంచం ఆగిపోతుందన్నంత విశ్వాసంతో...

అలా రివ్వున దూసుకొస్తుందెవరు?

దీప... దీపా! దీపా! నా నెలరోజుల నేస్తమా! ఏవయిందేవయింది?

"రాస్కెల్... కవిత్వపు పైత్యం ఎక్కువై మీద పడ్డాడు..."

రొప్పుతోంది.

ఎవరెవరెవరు? తెలిసింది... అతడే... ఆనంద్... ఆనందే...

దీపని ఏం చేసి ఉంటాడు? కౌగిలించుకొన్నాడా విశాల హృదయంతో...

"చెంప మీద ఒక్కటిచ్చి కిందకి తోసా..."

ఆహా! భలే చేశావు... మంచి పని చేశావు... ఎంత బాగా చేశావు...

"కానీ... అతనో గొప్ప మేధావి... రచయిత..." నా మాటల్లోని వ్యక్తి కన్నా ఎదుటి వ్యక్తే అద్భుతంగా ఉందే!...

"అయితే ఏంటండీ... ఇప్పటికే రాజకీయ నాయ కుల పిరుదుల చరుపులకీ, అధికారుల ద్వంద్వార్థా లకీ, మహాపండితుల చేతుల సవరింపులకీ విసిగిపోయి ఉన్నాం. ఇక మేధావుల కంట్రిబ్యూషన్ని భరించలేం..."

దీపా! అవునవును... భరించలేం... మరి భరించ లేకేం చేస్తాం?...

"నేను నటన పట్ల ఆసక్తితో వచ్చాను. అంతే తప్ప నా శరీరాన్ని మార్కెట్ వస్తువు చేసే ఏ బేరసారాలనూ ఒప్పుకోను. నేనందుకు రాలేదు..."

అంతే... అంతే... అట్లా రావొద్దు... మరి రాకేం చేస్తావూ?...

"నా అభిరుచులకన్నా నేనెక్కడ ముఖ్యమో నా సేవ ఎవరికి అవసరమో అక్కడికే వెళతాను. నాకీ

ప్రపంచం అర్థమవుతోంది. నేను ఏ ప్రలోభాలకీ, ప్రభావాలకీ లొంగిపోను...''

పోవద్దు... పోవద్దు... పోక మరెక్కడికి వెళ్తావు?...

''దీనిని మించిన జీవితం బయట చాలా వుంది...''

అవునా... ఉందా?...

''నీకా?...''

''మనందరికీ...'' ఎంత స్థిరత్వం దీప గొంతులో...

''కానీ... కొంచెం రాజీపడితే సెల్‌ఫోన్లు, మంచి బట్టలు, కార్లు, హోటల్స్, పబ్స్...'' నన్నేవి ప్రలోభపెట్టాయో తలుచుకొన్నాను.

''భలేవారండీ మీరు! మనుషులకన్నా వస్తువులు ముఖ్యమా?'' పక్కనున్న వ్యక్తి చేతిని తన చేతిలోకి తీసుకొంటూ అంది.

అతని మొహంలోని విద్యుల్లతలు నా వాడి(ళ్ల)లో ఎన్నడూ చూసిన అనుభవం లేదే!

''నువ్విక్కడ ఉండలేవు... నిన్నుండనివ్వరు...'' ఆందోళన... గాభరా... మళ్లీ...

''నేను కిరణాన్నే అయితే... నాలో జ్వలనమే ఉంటే... అరచేతి నడ్డుపెట్టి...'' కలకల నవ్వింది దీప... గలగల నవ్వింది దీప.

ఇట్లా మాట్లాడే దీప... నాకెంతో నచ్చిన దీప... నాలోని అసలు నన్ను బయటకి లాగే దీప కూడా నాకు దూరమయిపోతుంది. ఎవరూ ఉండరు. మళ్లీ నేను ఒంటరిదాన్నే... నెర్రెలు విచ్చిన భూమిలా ప్రేమ చినుకై వేచి చూస్తూ...

ఈ ఇల్లు చీకటిగుహ... రాధీ... ఓ రాధికా! భయపడకు... డాక్టర్ చెప్పిన నీ మేధస్సుని తలుచుకో... సక్రమంగా ఉన్న నీ శరీరాన్ని చూసుకో!... దీపలోని ధైర్యాన్ని గుర్తుచేసుకో... కానీ... దీప... దీప కూడా నాకు దూరమవుతుందా? ఇక హృదయం వట్టి బీడు... నిర్వేదంగా పడుకొన్నాను... తెల్లారి లేచేసరికి ఆశ్చర్యం...

హృదయం నిండా చిన్నచిన్న మొలకలు...
రాత్రికి రాత్రే ఎవరు పంపారు తడిని?
ఎవరు చల్లారు విత్తనాలని?
అతని చేతిని పట్టుకొన్న దీప చెయ్యా?
అతని మొహంలోని విద్యుల్లతలా?

*ఆదివారం వార్త, 26 ఆగస్టు 2007*

